రామమోహన్, మహీధర

దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటం

హైదరాబాదు, 1946

Record no. 75

Rāmamōhan, Mahīdhara

Dakṣiṇāphrikā Bhāratīyula pōrāṭaṃ

Haidarābādu, 1946

Record no. 75

Bibliographic Record Target

రామమోహన్, మహీధర.
దక్షిణాఫ్రికా భారతీయుల పోరాటం / రచన మహీధర రామమోహన్. - హైదరాబాదు (దక్కన్) : ప్రజా ప్రచురణాలయం, 1946.
30, 2 p. ; 17 cm.
Record no. 75

Rāmamōhan, Mahīdhara.
Dakṣiṇāphrikā Bhāratīyula pōrāṭaṃ / racana Mahīdhara Rāmamōhan. - Haidarābādu (Dakkan) : Prajā Pracuraṇālayaṃ, 1946.
30, 2 p. ; 17 cm.
Record no. 75

దక్షిణాఫ్రికా

భారతీయుల పోరాటం

రచన:

మహీధర రామమోహన్

ప్రజా ప్రచురణాలయం,

నారాయణగూడ, హైదరాబాదు (దక్కన్.)

ప్రచురణ నెం 27

ఆగస్టు 1946

ప్రతులు 3000

నేషనల్ ప్రెస్, నారాయణగూడ,

హైదరాబాద్ (దక్కన్.)

వెల

కల్దారు 0–4–0

హాలీ 0–4–8

1

నల్ల జాతులు

మనం అంతా దక్షిణాఫ్రికా అని పిలిచేది నాలుగు రాష్ట్రాలుకలిసి ఏర్పడ్డ ఒక దేశ భాగం. కేప్‌కాలనీ, ఆరంజిఫ్రీస్టేట్, ట్రాన్స్‌వాల్, నేటాల్ అనే ఆ నాలుగు రాష్ట్రాలుకూడా ఒక్కొక్కటి ఒక్కొక్క దేశం అంత పెద్దది,

కాని, జనాభావేపుచూస్తే అదిచాలతక్కువ. 5–6 లక్షల చదరపు మైళ్ళ వైశాల్యంగల ఆ ప్రదేశంలో యూరపియన్లయితేనేం, భారతీయులూ, దేశవాసులూ ఐతేనేం, అంతాకలిసి 96 లక్షలమంది వున్నారు.

విశాలమైన దేశం, జనాభా తక్కువ అనేటప్పటికి ప్రతివారికీ అది ఎడారో, చవిటిపర్రో అయివుంటుందనిపిస్తుంది. కాని, దక్షిణాఫ్రికా విషయంలో అటువంటి అభిప్రాయం మాత్రం పడొద్దు.

ఏమంటే –

● దక్షిణాఫ్రికాలో బంగారం పండుతుంది. నిజం! ప్రపంచం అంతటిలోనూ తవ్వబడుతూన్న బంగారంలో మూటికి నలభై వంతులు అక్కడే తవ్వబడుతూంది.

● దక్షిణాఫ్రికా రత్నాలగని. పొగడ్త అనుకోవద్దు. ప్రపంచంలో కల్లా పేరుపడ్డ వజ్రాలగనులు అక్కడున్నాయి.

అంతేనా? ఎన్నిగనులు; ఎన్ని ఖనిజాలు!

ఒక్క ఖనిజాలేకాదు. పంటలుకూడా అక్కడ ఎక్కువే. నేటాల్ చెరకుపంటకి ప్రసిద్ధి. కేప్‌రాష్ట్రంలో పండ్లతోటలు జాస్తి. మిగిలిన రెండింటిలో పశుసంపద హెచ్చు.

అంతసంపద, అంతభూమి, అంత కొద్దిమంది జనం అనేటప్పటికి పోనీ మనంకూడావెడితే ననిపిస్తుంది. తప్పకుండా.

ఎందుకు? ఆ సంపదలు అక్కడి ప్రజలకి జాస్తి, వాటిని పూర్తిగా ఉపయోగంలో పెట్టేందుకు తగినజనం అక్కడలేరు. ఇక్కడకంటె అక్కడ ఎక్కువ సుఖపడవచ్చుగనక....

కాని, దురదృష్ట వశాత్తూ దక్షిణాఫ్రికాలో కొద్దిమంది పరిశ్రమల యజమానుల్నీ, భూస్వాముల్నీ మినహాయిస్తే ప్రజలు సుఖంగా తిండేనా తినగలుగుతూన్నారని చెప్పడానికి వీలులేదు.

అక్కడున్న కోటిమందిలో 2,60,000 మంది తెల్లవారికి సాలుసరి ఆదాయం 466 పౌనులువుంది. వీరుగాక వేరు వేరు వృత్తులు చేసుకుంటూ మరో 18 లక్షలమంది తెల్లవాళ్ళున్నారు. వారి సాలుసరి ఆదాయం మళ్ళీ 50 పౌనులే. మిగిలిన 80 లక్షలమందీ నల్లవారు. వీరి సగటు ఆదాయం సాలుకి 12 పౌనులలోపు. ఎంత తేడావుందో చూడండి!

దక్షిణాఫ్రికాలోని ఆఫ్రికనులలో సగం మందికి పైగానూ, భారతీయుల్లో మూడోవంతుమందీ గడుపుతూన్నదొక జీవితంకాదు.

దేశంలోని సంపత్తువంతనీ గుప్పిట్లోపట్టుకొన్న కొద్ది మంది తెల్ల కోటీశ్వరులు, మిగిలిన ప్రజలంతా తమ గొంతుక పట్టుకోకుండా అడ్డపడే టందుకై తెల్ల వారికి ధనం ఎక్కువ ముట్టే మంచి వుద్యోగాలూ, అవీ యిచ్చి మిగిలిన ప్రజలతో కలవకుండా చేసి వుంచేరు.

ఇంక దేశంలోని నల్ల వారిలో కూడా భారతీయులలో కొందరికి కొన్ని సౌకర్యాలిచ్చి ఆఫ్రికనులతో కలవ కుండా చేసేరు.

అందరికీ దిగువన అసలాదేశంలోని ఆదిమ నివాసి. అందరికీ పైన యూరోపియను కోటీశ్వరుడు.

అందరికీ పైన వుండే తనఅధికారం చేయిజారి పోకుండా ఆదిమ నివాసిని నల్ల వాడన్నాడు. నల్ల వాడి కంటె తెల్లవాడు ఉత్తముడన్నాడు. ఉత్తములకి అధికారం, అధములకి బాధ్యతలూ పంచేడు. నల్ల వారి కెదురుగా తెల్ల వారిని జతచేసుకున్నాడు. వారికి జాతి దురహంకారం మూరి పోసి, తనపక్కన వుంచుకున్నాడు.

* * *

తెల్ల జాతివారు అసలు ఆదేశంలోవాళ్ళు కారు. అమాయికులయిన ఆఫ్రికను జాతివారి కులపెద్దలకి పాతతుపాకులూ, పూసలపేర్లూ బహూమతు లిచ్చి భూములన్నీ వ్రాయించేసుకున్నారు. గనులుండే ప్రదేశాలన్నీ గుత్త పట్టేరు. ఈ విధంగా దేశంలో సంపదంతా వారి హస్తగతమైంది పడి

పోయింది. తెల్లవాడికి ఈ భారం ఎత్తుకోడం తప్పదనుకున్నారు. ఎత్తుకున్నారు.

అంతకాలంగా మురుగిట్లో పడివున్న సంపదల్ని అనుభవంలోకి తెచ్చుకోలేక, ఎక్కడి నుంచో చుట్టపుచూపుగా వచ్చిన తెల్లవానికి సర్వస్వమూ వొప్పగించేసి నోట్లో వేలుపెట్టుకూర్చున్నవాడు నల్లవాడు. అతడా భారంలో ఏ కొంచెమూ భరించలేకపోవడంచేతనే కాదూ ఇచ్చేసేడు.

అందుచేత నేర్పరితనం అవసరమయ్యే వృత్తులూ, వృత్తిపనులూ తెల్లవాడికిచ్చేరు. పొలాలలోనూ, గనుల్లోనూ, తెల్లవారి యిళ్ళలోనూ కూలిపని నల్లవాడికిచ్చేరు.

రాజకీయోద్యోగాలూ, ప్రభుత్వమూ, అధికారమూ తెల్ల వారిదన్నారు పన్నులిచ్చుకోడం, పస్తుపడుకోడం, నల్ల వాడికిచ్చేరు.

తెల్ల వాడు ఎక్కువ - నల్ల వాడు తక్కువ. కనక

తెల్లవారుండే పేటల్లోనేకాదు, వూళ్ళల్లోనే వుండకూడదు నల్ల వాడు. నూటికి 70మందికి పైగావున్న నల్ల వారికిప్రత్యేకంగా కొంతప్రదేశం రిజర్వుచేసేసి, దానికి వెలుపల అతడు స్వంత ఆస్తికలిగి వుండకూడదన్నారు.

తెల్ల వాళ్ళ కోసమే రోడ్లు. నల్ల వాళ్ళు ఆ రోడ్ల మీద నడవకూడదు.

తెల్ల వాళ్ళు తినే హోటళ్ళలో వారికి ప్రవేశంలేదు. తెల్ల వారి పాఠశాలల్లో నల్ల వాడికి ప్రవేశంలేదు. పోస్టాఫీసుల్లో నల్ల వాడిపని చూసేందుకు కౌంటర్లు వేరు. పార్కుల్లో వాళ్ళ బెంచీలే వేరు. యూరోపియన్లు కూర్చుని వుండకపోయినా నల్లవాడు తెల్ల వాని బెంచీ మీద కూర్చుండ కూడదు.

పోనీ ఆ కూలిపనేనాయె, కుటుంబం గడుస్తుందా అంటే అదీలేదు. అది కూలిపనేకాదు. పట్టి బానిసత్వం. వారి చాకిరీకి ప్రతిఫలంగా వాళ్ళకి ముట్టేది ఇంత తిండి. అదయినా పనిచేసేవాడికి మాత్రమే!

చాకిరీ ఎక్కువ, పొట్ట గడవకపోవడంతో తెమలలేదు. నల్ల కూలీలమీద తెల్లయజమానులు సాగించే దౌర్జన్యాలకి హద్దువుండదు. ఆ దౌర్జన్యాలనిగూర్చి పత్రికలకెక్కి గందరగోళం అయ్యేస్థితివస్తే ప్రభుత్వమే శాసనసభలో ఒక సూచన తెచ్చింది. నల్లకూలీలమీద యజమానులు దౌర్జన్యాలు చేయకుండా సూపర్వైజర్లని వెయ్యాలని ఆ సూచన. దానికి తెల్ల భూస్వాములు మండిపడి ఆ సూచన తెచ్చిన మంత్రిమీద విరుచుకు పడితే హడిలిపోయి అతడు తన సూచనని ఉపసంహరించుకున్నాడు.

దేశంలో నల్లవారికి ప్రత్యేకించబడిన ప్రదేశంలో పొట్ట గడవకపోవడం, తెల్ల భూస్వాముల పొలంపనులవలన రోజు వెళ్ళకపోవడం మొదలయిన దుర్భర పరిస్థితులు కారణంగా దేశవాసులు, వేలూవందలూ, పట్టణాలకి చేరుకోసాగేరు.

దానితో తెల్లభూస్వాములకి బెదురు పుట్టింది. దేశవాసులు పల్లెలు వదలిపోతే తమ పనులు జరిగే దెల్లాగ? జనం తగ్గిపోతే కూలి హెచ్చుతుంది. పని చేసేవాడికి మాత్రమే ఇంతతిండి పడెయ్యడంపోయి, వాడి కుటుంబానికూ్కడా ఇచ్చుకోవలసి వస్తుంది. ఆ విధంగా జరగడం వారి కెంతమాత్రం ఇష్టంకాదు. దానికోసం నల్లవాడిని వాని నివాసప్రదేశానికి అంటగట్టేటందుకై చట్టాలు తయారు చేసేరు.

ప్రతి నల్లవాడికి 'ప్యాస్, దగ్గరుండాలి, ప్యాస్ లేకపోతే జైలులో పెడతారు. కొత్తచోటికి వెళ్ళినప్పుడు పోలీసు స్టేషనులో చెప్పుకోవాలి. వాళ్ళు రాత్రులు బయటతిరగ కూడదు, అల్లా తిరగగలగాలంటే ఎవ్వడైనా తెల్లవాని సంతకంగల చీటీ దగ్గరుంచుకోవాలి.

కేవలం నల్లవారిని దొంగలుగా అవమానపరచేరు. మధ్యయుగాల నాటి జమీందారీ ప్రాంతాలలోని దాసుల (Serfs) స్థితికి తీసుకొచ్చేరు.

పట్టణాలకి 'పట్టి సోమరిపోతులు' చేరకుండా తరిమేసేరు. "తెల్లవాళ్ళ అవసరాలకి కావలసినవారిని" తప్ప అందర్నీ వెనక్కి పంపేసి ప్రభుత్వం తెల్ల భూస్వాములకి చవక కూలీల సమస్యని తీర్చేసింది.

* * *

దేశవాసులయిన నల్లజాతులు కాలక్రమేణా కళ్ళుతెరిచేరు. తమ హక్కుకోసం పోరాడేటందుకై ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ అంటూ ఒక సంస్థను స్థాపించుకున్నారు. దానిద్వారా ప్యాస్ చట్టాలకి, రంగు విభేదంకి వ్యతిరేకంగా పోరాడుతూన్నారు.

ఈ సంస్థ తమ కొరకు్కరికోసమే పోరాటం సాగించుకుంటామనే పద్ధతిలోగాకుండా, దక్షిణాఫ్రికాలో తెలుపు-నలుపు పేరిట జరుగుతూన్న అన్యాయాలకి వ్యతిరేకంగా పోరాడే వారందరితోనూ చెయ్యికలిపి పని చేస్తూంది. అంతేకాదు సామ్రాజ్య వ్యతిరేక శక్తులతో ఐక్యమై, పీడనకీ, పరాధీనతకి వ్యతిరేకంగా పోరాడుతూంది.

2

భారతీయులు

దక్షిణాఫ్రికాలోవున్న 96 లక్షలమంది జనాభాలో భారతీయుల సంతతివారిసంఖ్య 2 లక్షల ఏభై వేలు. వీరంతా అక్కడున్న నాలుగు రాష్ట్రాలలోనూ చెదిరి వున్నారు. నేటాలులో 2 లక్షల పదివేలమంది, ట్రాన్స్‌వాల్‌లో 30 వేలమంది, కేప్‌రాష్ట్రంలో పదివేలమంది, ఫ్రీస్టేటులో కొద్ది వందలమంది మాత్రం వున్నారు. ఈ భారతీయులు ఏ రాష్ట్రంలో వున్నా, అదే తమ జన్మభూమిగా చేసేసుకున్నారు. చివరకి వారు భాష కూడా అక్కడిదే అనుసరిస్తూన్నారు. పొలం పుట్రా కొనుక్కునీ, వర్తక వ్యాపారాలు చేసుకునీ, చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకునీ, కూలీ నాలీ చేసుకునీ ఆ దేశస్తుల్లో ఒకరుగా అయిపోయేరు. వారిలో చాల కొద్దిమంది మాత్రమే తమ పూర్వులు పుట్టిన భారతదేశాన్ని చూసివుంటారు.

ఆవిధంగా తల్లిదేశంవిడిచి పొట్టచేతపట్టుకొని వెళ్ళిపోయిన ఆ భారతీయులు సహాయంకోసం తల్లిదేశంవంక చూడవలసిన స్థితివచ్చింది.

సామాన్య మానవుడికుండే సామాన్యపు హక్కులు సంపాదించుకునేటందుకు, నేమూ మానవుణ్ణే యనిపించుకొనే అర్హతకోసం వారు పోరాడుతున్నారు. ఫాసిస్టుల దౌర్జన్యాలని మించిన దౌర్జన్యాలకి గురి అవుతూ భారత ప్రజలయొక్క సహాయాన్ని కోరుతూన్నారు.

* * *

నూరేళ్ళక్రితం దక్షిణాఫ్రికాకి - భారతీయులకి సంబంధమేలేదు. ఆ దేశప్రభుత్వమే భారతీయుల్ని అక్కడి యూరపియన్లకోసం రాక తప్పదని పట్టుపట్టి ప్రాధేయపడి తీసుకెళ్ళింది. అదంతా ఓ పెద్దగాధ.

నేటాల్ రాష్ట్రంలోభూమి చెరుకు పంటకి మంచి లాయకుగా వుంటుందని 1850 ప్రాంతాలలో అక్కడి తెల్ల భూస్వాములు తెలుసుకున్నారు. కాని చెరకు పండించేటందుకు తగిన మనుష్యులు వద్దూ? దేశ

వాసులయిన ఆఫ్రికన్లు ఆ పని చెయ్యలేరు. ఏ యూరపియను దేశాలనుంచేనా తీసుకు రావడానికి కూలి హెచ్చు ఇవ్వుకోవాలి. పైగా వారిచేత బానిసల మాదిరిగా పనిచేయించుకునేందుకు ఆ దేశ ప్రభుత్వాలు ఒప్పుకోవు. అందుచేత వారి దృష్టి భారతీయుల మీదపడింది. దక్షిణాఫ్రికాలోని యూరపియన్లు అక్కడి ప్రజల్ని పెట్టే ఇబ్బందులు అంతా ఎరుగుదురు కాదూ? అందుచేత మొట్టమొదట్లో భారత ప్రభుత్వంకూడా అక్కడికి కూలీల్ని పంపడానికి అంగీకరించలేదు. దానిమీద బ్రిటిష్‌ప్రభుత్వాన్ని పట్టుకుని, వారి సిఫార్సుతో భారత ప్రభుత్వాన్ని అంగీకరింప చేసేరు.

ఇది 1860 లో జరిగింది. దక్షిణాఫ్రికాలో తెల్ల భూస్వాములకోసం కంట్రాక్టు కూలీలను పంపడం ఆరంభించేరు.

కంట్రాక్టు కూలీ అయిదేళ్ళపాటు ఎవ్వడేనా తెల్లవాని క్రింద పని చెయ్యాలి. ఆ మధ్యకాలంలో అతడు యజమానిని వదిలి వేరొకరివద్ద తనంత తాను కుదురుకోడానికి వీలులేదు. అలాగ వెళ్ళిపోతే యజమాని అతనిమీద చర్య తీసుకోవచ్చు. ఇద్దరి యజమానులు కూడబలుక్కుని కూలివాడికి ఇష్టము లేకపోయినా అతనిని మార్చేసుకోవచ్చు

ఈ కంట్రాక్టు కూలితనానికీ బానిసత్వానికీ తేడాలేదు. బానిసత్వంకి కాలపరిమితిలేదు. దీనికి అయిదేళ్ళంటూ పరిమితి ఒకటుంది.

ఈ బానిసత్వం వెల ఎంతో తెలుసా? బస, భోజనం, రోగంవస్తే మందుయిచ్చి నెలకి ఏడు రూపాయిలు!

ఈ బానిసత్వపుమాత్ర చులకనగా మింగుడు పడడానికై నేటాలు ప్రభుత్వమూ, వారి ఏజంట్లూ స్వర్గాన్నిదుర్చు కొచ్చేరు.

ఈ అయిదేళ్ళలోనూ మంచికూలి దొరుకుతుంది. ఖర్చులన్నీ మావే గనక ఈ అయిదేళ్ళలో 400 రూ॥లు మిగులుతాయి. అప్పుడు జేబునిండా డబ్బు వేసుకుని దేశానికి వచ్చెయ్యొచ్చు అన్నారు.

అల్లాకాదు, అక్కడే వుందామనుకుంటే మరీమంచిది. మొదటి మాటుకంటె హెచ్చుకూలికి మరో అయిదేళ్ళు కంట్రాక్టుకి కుదరవచ్చు. కంట్రాక్టు కూలివనికి ఇష్టంలేకుంటె రోజుకూలికి వెళ్ళొచ్చు. స్వతంత్రంగా బ్రతకొచ్చు అన్నారు.

కొత్తడబ్బు చేతిలో చేరిందంటె అక్కడే ఇల్లూ, వాకిలీ కొనుక్కోవచ్చు. దేశంనుంచి పెళ్ళాం పిల్లల్ని తెచ్చుకుని దర్జాగావుండొచ్చునన్నారు.

ఇల్లాగే ఎన్నో ఆశలుచూపేరు. ఏమంటే 'నేటాల్ మెర్క్యురీ' చెప్పినట్లు "కూలీల్ని వలసతేవడం ప్రాణాధార సమస్య." వారికి, ఆరోజుల్లో.

ఒక పదేళ్ళు గడిచేటప్పటికి దక్షిణాఫ్రికాలో తెల్ల భూస్వాముల దౌర్జన్యాలు పొక్కిపోయి జనం వలసపోవడం తగ్గింది. దానితో మళ్ళీ అక్కడి 'స్వర్గసీమ' లో కొన్ని కొత్త సంస్కరణలు చేసేరు.

భారతీయ కూలీల్ని తెల్ల యజమానుల చేతినుంచి కాపాడేటందుకు "రక్షకుడి" ని ఒకడిని నియమించేరు. వైద్య సహాయానికి మెడికల్ ఆఫీసర్లని వేసేరు. పైగా కూలీలకి ఓడల్లో సౌకర్యాలు చేయడానికై 10 వేల పౌనులు ప్రభుత్వం కేటాయించింది కూడా.

భారతీయ కూలీలవలన దక్షిణాఫ్రికాకి జీవం ఇచ్చింది. 1859 లో నేటాల్‌లో 1173 టన్నుల పంచదార మాత్రమే పండితే 1868 లో 9173 టన్నులు పండించబడింది. స్వల్పఖర్చుతో 8 రెట్లు పంట!

1874 నుంచి దక్షిణాఫ్రికాలోకి కంట్రాక్టు కూలీలే గాక వర్తకులు కూడా పోవడం ప్రారంభించేరు. భారతదేశపు వర్తకులు తెల్లవారిలా కాకుండా దేశవాసులతోటీ, కూలీలతోటీ మర్యాదగా వ్యవహరించేరు. దానితో వారివర్తకం బలపడింది.

ఈలోపుగా కంట్రాక్టులు పూర్తియైపోయిన వారిలో కొందరు ఇళ్లూ, పెరళ్ళూ కొనుక్కుని వ్యవసాయం ప్రారంభించేరు. కూరలపెరళ్లు, పండ్ల తోటలు పెంచుకున్నారు. చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించు కున్నారు.

భారతీయులు కష్టపడి నేటాల్ రాష్ట్రాన్ని దక్షిణాఫ్రికాకి 'కోనసీమ'గా మార్చేరు.

అప్పుడే ఆరంభమైంది చిక్కు. దక్షిణాఫ్రికాలో యూరపియను భూస్వామికి కావలసింది, పట్టి బానిసలా పనిచేసేకూలివాడే. స్వతంత్రంగా వ్యవసాయం చేసినా, వర్తకం పెట్టినా తనకి పోటీ తయారవుతుంది. తనతో పోటీ చెయ్యగలవాడిని అక్కడ భరించడం ఏలాగ?

1880 లో వచ్చిన ఆర్థిక మాంద్యముయొక్క దెబ్బ తగిలినప్పుడు బీద తెల్లకూలీల అసంతృప్తిని తప్పుదార్లు తొక్కించేటందుకూ, తమ పోటీ వదుల్చుకునేటందుకూ పెట్టుబడిదారులు భారతీయులకు వ్యతిరేకంగా దండయాత్ర ప్రారంభించేరు. స్వతంత్రంగా జీవిస్తూన్న భారతీయుల వ్యవసాయాలూ వర్తకాలు ఆర్థికమాంద్యానికి కారణం అయినట్లుగా ప్రదర్శించేరు. వారిని వొదుల్చుకుంటె తప్ప తెల్లకూలీలకి లాభం లేదన్నట్లు చూపేరు.

కాని, ఒక్కమారుగా వొదుల్చుకోడం అంటే మాటలా? భూమీ-పుత్రాకొమక్కాని. వ్యవసాయం-వ్యాపారం చేసుకుంటూన్నవాళ్ళ మాకిష్టం లేదు పొమ్మంటే పోతారా? వాళ్ళంతట వాళ్ళు పోయేటట్లు ఎసరుపెట్టాలి.

ఆ పని చేసేటందుకు ముందుగా భారతీయులకున్న రాజకీయపు హక్కులు లాగెయ్యాలి. అది కాస్తా జరుగుతే న్యాయబద్ధంగా ఎంతలేసి అన్యాయాలయినా చేసెయ్యొచ్చు

దక్షిణాఫ్రికాలో మొట్టమొదట భారతీయులమీద దాడి ప్రారంభించిన గౌరవం ట్రాన్స్‌వాల్, ఫ్రీస్టేట్లకి దక్కింది. దానికి కారణం వుంది.

కంట్రాక్టు కూలీలుగా వెళ్ళిన భారతీయులు హెచ్చుమంది నేటాల్ వెళ్ళేరు. కంట్రాక్టు కాలం ముగిసినాక హెచ్చు కూలీ దొరికే చోట్లు వెతుక్కోవడంలో వారు ఫ్రీస్టేట్, ట్రాన్స్‌వాలులకి పాకేరు. వచ్చినవారు వర్తకులుగానో, వృత్తిపనులలోనో, స్వతంత్రులయిన కూలీలుగానో వ్యవసాయకులుగానో స్థిరపడిపోవడంతోటే అక్కడి యూరపియన్లు వెనువెంటనే దాడి ప్రారంభించేరు.

నేటాల్‌లోకూడా అచర్యలు ప్రత్యక్షంగా సాగించివుండేవారే. కాని అది సార్వభౌమాధిపత్యంలో వలసగా వున్నంతకాలం అధమం పైచూపులకేనా భారతీయులమీద ప్రత్యక్షపోరాటం ప్రారంభించలేకపోయింది. 1893 లో నేటాల్‌కు బాధ్యతాయుత ప్రభుత్వం దఖలుపడింది. వెంటనే ఆ ఏడాదే భారతీయులకిగల రాజకీయాధికారాలు తొలగిస్తూ బిల్లు ప్రవేశపెట్టేరు.

*   *   *

1887 నాటికి ట్రాన్స్‌వాల్, స్వతంత్రంగా బోయరు రిపబ్లిక్‌గా వుండేది. అక్కడ స్థిరపడ్డ భారతీయులకి యూరపియన్లతో సమంగా వర్తకవ్యాపారాలు చేసుకునే హక్కు, ఆస్తులు కలిగివుండే హక్కు వుండేవి. 1887 లో వారికి ఆ హక్కులు తొలగించేసేరు. "ఆరోగ్య విధుల్ని అనుసరించక చాలా అసహ్యంగా జీవిస్తార" నే నెపంతో వారిని వేరుపెట్టి యూరపియన్లుండే ప్రాంతాలలో ఇళ్ళు స్థలాలూ, కలిగి ఉండకుండా నిషేధించారు.

ఇంక ఫ్రీస్టేటులో వర్తక వ్యాపారాలు మూయించేసి నామకః నష్టపరిహారం ఇచ్చి దేశంలోంచే పంపేసేరు. ఈ నాడు అక్కడున్న భారతీయుల సంఖ్య 30, 40 మందికంటె ఎక్కువలేదు.

నేటాల్‌లో ప్రత్యక్షంగా శాసనం లేకపోయినా భారతీయుల్ని పీడపరచడం, హింసించడంలో లోపం ఏమీ జరుగలేదు. అవమానపడడం అనేది భారతీయుడి జీవితంలో ఒక భాగం అయిపోయింది.

గాంధీజీ దక్షిణాఫ్రికా వెళ్ళినప్పటి రెండుఘటనలు చెప్తేచాలు, భారతీయుల కక్కడ ఎంతెంత అవమానాలు జరిగేవో తెలుస్తుంది.

గాంధీజీ ఒక మారు గుర్రపుబండీలో ప్రయాణం చెయ్యవలసి వచ్చింది. ఆయనని లోపల కూర్చోనివ్వక బండివాడు తన కాళ్ళవద్ద చోటుచూపేడు. గాంధీజీ నోటవెంట "ఇదేమన్యాయము"నే మాటవచ్చిందో లేదో, ఆ బండితోలే తెల్లవాడు ఆయన గూబలు కదలేసి చావకొట్టేడు.

మరోమారు ఆయన తెల్లవారి వీధివెంట రోడ్డునపడి కోర్టుకు పోతూంటే ఒక సాధారణ పోలీసువాడు పడతన్నేడు. ఏమంటే తెల్లవాడు నడిచే రోడ్డున నల్లవాడు నడవకూడదు!

మొదటిరోజుల్లో ఈ అవమానాలని ఎదుర్కొని పోరాడగలశక్తి భారతీయులకి లేక పోయింది. ఏమంటే వచ్చింది దూరదేశం. రెండోది వారిసంఖ్య స్వల్పం. మూడోది వారినిగురించి శ్రద్ధ తీసుకునే ప్రభుత్వం కాదు తమదేశంలోది. నాల్గోది వెళ్ళినవారంతా కూలీలు. చదువు సంధ్యలు లేనివారే ఎక్కువ. అన్నింటికీ ఆఖరున దక్షిణాఫ్రికావెళ్ళిన మొదటి భారతీయులలో చాలా హెచ్చుభాగం తల్లిదేశంలో సంఘబాహ్యులుగా చూడబడే హరిజన కుటుంబాలకి చెందినవారే. అందుచేత దూరంగా వుంచడం వారికి కొత్తకాలేదు.

కాని క్రమంగా దక్షిణాఫ్రికాకు అన్ని వర్ణాలవారూ వచ్చేరు. ఆర్థికంగా మంచి స్థితిలోవున్న వర్తకులు వచ్చేరు. కొద్ది గొప్ప చదువుకున్న వాళ్ళు వొచ్చేరు. వీరంతా తమకి జరిగే అవమానాలకి బాధపడకుండా వుండలేకపోయేరు. ఈ అసంతృప్తి క్రమంగా అందరిలోకి పాకింది. కాని, అది ఒక రూపంలోకి రావడం 1894 లో గాని జరగనేలేదు.

భారతీయు లంతకంతకి హెచ్చుగా రావడంచూసి, వారి వలస నిలుపుచేస్తేగాని వీలులేదనేభావం దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి పుట్టింది.

● కొత్తగావచ్చేవారిని దక్షిణాఫ్రికాలో స్థిరపడకుండా వుండేషరతు మీదనే తీసుకురావడం;

● అదివరకు తీసుకొచ్చిన వారిని అగ్రిమెంటు కాలం పూర్తికాకుండానే పంపెయ్యడం;

● వెళ్ళకుండా అక్కడే కొంతకాలం వుండదలిస్తే మళ్ళీ ఎవరివద్దనో కంట్రాక్టువ్రాసి కూలీగా వుండడానికి ఒప్పుకుంటే మాత్రమే వుంచడం:

ఈ నిబంధనలకి దాటిపోయిన వారికి ఏడాదికి 25 పౌనులు అంటే 375 రూ॥లు తలపన్ను వెయ్యడం.

ఇది నేటాల్ ప్రభుత్వం భారతీయుల బాధ వొదుల్చుకుందుకు వేసిన పథకం. దీనివలన పన్ను ఇచ్చుకోలేక స్వతంత్రంగా జీవించుతూన్న వారంతా దేశం వెళ్ళిపోతారు. మిగిలితే బానిసల్లా వుపయోగించే కూలీలే వుంటారు. వారికి కావలసింది అంతేగా!

తలపన్ను: 16 ఏళ్ళు వచ్చిన ప్రతిమగాడికీ, 13 ఏళ్ళు వచ్చిన ప్రతి స్త్రీకి సాలుకి 375 రూపాయల పన్ను!

ఈ పన్నుసూచనని ఆరోజుల్లో భారతదేశపు రాజప్రతినిధిగావున్న ఎల్గిన్ ముందుపెట్టేరు దక్షిణాఫ్రికాప్రభుత్వప్రతినిధులు. ప్రభుత్వం మనదే గనక అయివుంటే ఈపన్నుసూచనతో మనముందుకి రావడానికి గుండెలెవరికుంటాయి? భారతదేశంమీద నిజమైన అధికారం బ్రిటనుది. ఇక్కడ అధికారంచేస్తున్న ఎల్గిన వాళ్ళవాడు. అలాంటప్పుడు దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి సిగ్గూ, భయమూ ఎందుకుంటుంది? కాని, భారతీయులు బీద వాళ్ళుగనక సాలుకి 25 పౌనులు ఇచ్చుకోలేరని దయదలచి ఎల్గిన ఆ పన్ను 3 పౌనులకి తగ్గింపించేరు. ఎంత ఔదార్యం!

సరిగ్గా ఆ రోజుల్లోనే గాంధీజీ దక్షిణాఫ్రికాలో వున్నాడు. తమకి జరుగుతూన్న అన్యాయాలకీ, అవమానాలకీ సమిష్టిగా ప్రతిఘటించడాన్ని ఆయనే భారతీయులకి నేర్పేరు. ఆయన నాయకత్వంక్రిందనేవారి మొదటిపోరాటాలు సాగించబడ్డాయి.

గాంధీజీ సలహామీద 1894 మేనెల 22 వ తేదీన నేటాల్ ఇండియన్ కాంగ్రెసుఏర్పడింది. పుట్టిన కొద్దికాలంలోనే అది దక్షిణాఫ్రికా భారతీయులందరికీ ప్రతినిధిసంస్థ అయిపోయింది.

కొన్నాళ్ళ తర్వాత ట్రాన్సువాల్ లోకూడా భారతీయుల సంస్థ నిర్మితమయింది.

వీని నిర్మాణంతో దక్షిణాఫ్రికాలోని భారతీయుల జీవితపోరాటంలో ఒక కొత్త అధ్యాయం మొదలయింది.

3

మొదటి విజయం

నేటాల్‌రాష్ట్రానికి 1893 లో బాధ్యతాయుతప్రభుత్వం ఇవ్వబడింది. అదిమొదలుకొని అక్కడి యూరపియనులు భారతీయులయెడ తమకున్న క్రోధాలకి శాసనరూపం ఇవ్వసాగేరు.

ప్రతిభారతీయుడికి తలకి 3 పౌనుల తలపన్ను విధిస్తూ 1895 లో శాసనం చేసేసారు.

ప్రాథమికావస్థలోవున్న ఇండియన్ కాంగ్రెస్. చేసిన ఆందోళనం సార్వజనికం కాలేదు. ఉద్యమం మధ్య తరగతి వారిలో మాత్రామే నిలిచిపోయింది. ఉద్యమం ఇంకా కంట్రాక్టు కూలీలలోకి పాకలేదు. ఫలితంగా అవమానకరమైన యీపన్ను భారతీయుల నెత్తికి చుట్టుకుంది.

1896 లో పార్లమెంటుకి ప్రతినిధుల నెన్నుకునేటందుకు వోటు హక్కు రద్దు చేస్తూ నేటాల్ పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టారు. ఇండియన్ కాంగ్రెసు ఆందోళన సాగించింది. కాని యూరపియన్లు వినదలుచుకోలేదు. వినిపించుకొనేలా చేసేశక్తి ఇండియన్ కాంగ్రెసుకిలేదు. వీరి ఆందోళనకి వారుచెప్పిన సమాధానం 'వోటు హక్కు మీ దేశంలో వుందిగనకనా?' - 'అక్కడ లేనిది ఇక్కడ మాత్రం ఎందుకు?' - 'పైనుంచి వచ్చిన ఎవ్వరో కొద్దిమంది చేస్తూన్న గొడవగాని అసలు భారతీయులకి వోటుహక్కు గొడవే లేద' నీ ఇల్లాగే మొండి సమాధానాలు చెప్పుకొచ్చారు. చివరికి అదికూడా చట్టం అయిపోయింది.

దాని తర్వాత కొత్తగా దేశంలోకి వచ్చేవారి సంఖ్యని తగ్గించే ఒకబిల్లుని 1897 లో ప్రవేశపెట్టేరు. దానిప్రకారం దక్షిణాఫ్రికాలోకి రావా

లంటే ప్రతి భారతీయుడూ (ఇది కంట్రాక్టుకూలీలకి వర్తించదు) ఏదన్నా ఒక యూరపియను భాషలో పరీక్ష ఇచ్చి అర్హత సంపాదించుకోవాలి.

ఈ దశలో బోయిరు యుద్ధంవచ్చి కొద్దికాలంపాటు భారతీయుల మీది దండయాత్ర నిలిచింది. తమయెడ యూరపియన్లలో సదభిప్రాయం కలిగించితే, తమకి కలుగుతూన్న అన్యాయాలు నిలిచిపోయి యూరపియన్లతో సమానత్వం తప్పకుండా లభిస్తుందని వారు ఆశపడ్డారు. ఆ ఆశతోనే 1100 మంది భారతీయులతో గాంధీజీ నాయకత్వంక్రింద ఒక అంబ్యులెన్సు దళం ఏర్పడి బోయరు యుద్ధంలో ఆంగ్లేయులకి విపరీతమైన సహకారం చేసేరు.

ఈ ఒక్కమారే గాకుండా జులూ తిరుగుబాటు సమయంలోకూడా భారతీయులు ఇదే ఆశతో అంబ్యులెన్సుదళంగా ఏర్పడి యూరపియన్లకి సాయపడ్డారు.

యూరపియన్లు తమపై జరుపుతూన్న అత్యాచారాల్ని ఎదుర్కొని పోరాడడం కాదు వారి పథకం. మంచిచెడ్డల్లో వారికి సాయపడి వారి సదభిప్రాయం తెచ్చుకుని తమరు సౌకర్యాలుపొందడం. ఇదీ ఆనాటి దక్షిణాఫ్రికా ఇండియన్ కాంగ్రెసు నాయకులధోరణి.

ఈ విధానం తప్పనిసరిగా పరాజయం పొందుతుంది. ఏమంటే పీడనకి పాలవుతూన్న నల్ల తెగలన్నింటినీ కలుపుకొని స్వాతంత్ర్యం కోసం నడిపించేది కాదాపద్ధతి. అది కేవలం రాజీమార్గ. రాజీమార్గం విజయానికి దారితియ్యదు. అన్ని రాజీపంథాలకి పట్టే అవస్థే దీనికీ పట్టింది. యుద్ధకాలంలో తాత్కాలికంగా విరమించబడిన భారతీయ వ్యతిరేకత ఆ యుద్ధంముగియగానే రెట్టింపుబలంతో విజృంభించింది.

1906 లో ట్రాన్సువాల్‌లోకి కొత్తగావచ్చే ప్రతి భారతీయుడూ ఒక యూరపియను భాషలో పరీక్షనిచ్చితీరాలంటూ అక్కడ శాసనసభలో బిల్లు ప్రవేశ పెట్టబడింది. కొత్తగా ఆరాష్ట్రంలో అడుగు పెట్టదలచిన భారతీయులకి ప్రవేశం దొరక్కుండా ఆ బిల్లులో ఒక క్లాజు చేర్చబడింది. ఆ చట్టాన్ని అతిక్రమించి ఎవ్వరూ రాష్ట్రంలోకి రాకుండా నిలిపేటందుకు అనే నెపంతో ట్రాన్సువాల్‌లో ఉండదలచుకున్న ప్రతి భారతీయుడూ తన పేరు నమోదు చేయించుకుని, వేలిముద్ర లివ్వాలి అని నిర్ణయించేరు. ఈ విధంగా భారతీయు లందర్నీ దొంగల్లో జమకట్ట దలిచేరు.

దీనితో దక్షిణాఫ్రికా భారతీయులంతా అదిరిపడ్డారు. చేయవలసిన పనిని నిర్ణయించుకుందుకు ఒక పెద్ద సమావేశం జరిపేరు. ఈ దురంత శపు బిల్లును నిరోధించి తీరాలనే పట్టుదల ప్రతివారిలోనూ బయలుదేరింది.

ఆ నాటికి దక్షిణాఫ్రికా ఇండియను కాంగ్రెసు ఆ దేశంలోవున్న భారతీయు లందరిలోనూ స్థానం సంపాదించుకోగలిగింది. కంట్రాక్టుకూలీల ఇబ్బందుల్ని కూడా తీసుకుని పనిచేయడంవలన కాంగ్రెసుకు కూలీలలోకూడా పలుకుబడి ఏర్పడింది.

ట్రాన్సువాల్ ప్రభుత్వపు శాసనాన్ని ధిక్కరిస్తూ ట్రాన్స్‌వాల్‌లో ప్రవేశించడం ద్వారా సత్యాగ్రహం చేయడానికి నిశ్చయించేరు.

1307 జులై నెలలో సత్యాగ్రహం ప్రారంభమయింది. 1908 జనవరి నాటికి ఇంచుమించు 150 మంది భారతీయులు శాసన ధిక్కారనేరానికి జైళ్ళకి వెళ్ళేరు. అంత కంతకి ఉద్యమం ప్రజా సామాన్యంలోనికి వ్యాపించ సాగింది. దానితో దక్షిణాఫ్రికా ప్రభుత్వానికి బెదురుపుట్టింది. ప్రభుత్వం తరపున జనరల్ స్మట్సు రాజీకి వచ్చేడు.

ఆయన సూచించిన షరతులివి.

భారతీయులలో హెచ్చుమంది తమంతతాము పేర్లు రిజిస్టరు చేయించుకుంటే, తప్పనిసరిగా అందరూ రిజిస్టరు చేయించుకు తీరాలనే నిర్బంధం తొలగిస్తామన్నారు.

ఇదీ ఒకరాజీయేనా ?

గాంధీజీ సలహామీద భారతీయులు తమపేర్లు నమోదుచేయించుకున్నారు. ప్రభుత్వం పని జరిగిపోయింది. శాసనం శాసనంలాగనే వుండిపోయింది.

దానితోమళ్ళీ పోరాటం ప్రారంభించవలసి వచ్చింది.

1908 ఆగస్టులో మళ్ళీ సత్యాగ్రహం ఆరంభమయింది. జోహాన్నెస్ బర్గునగరంలో హమదామశీదువద్ద భారతీయులు సమావేశమై పోరాటానికి నాందీపూజగా తమ సర్టిఫికెట్లను తగులబెట్టి వేసేరు.

మళ్ళీ వందలకొద్దీ జనం జైళ్ళల్లో పడ్డారు. నాయకుల్ని అరెస్టు చేశారు. కొద్దికాలంలోనే జైళ్ళు నిండిపోయేయి. తుపాకికాల్పులలో ఎందరో చచ్చిపోయారు,

ఈ పోరాటంలోకి 1910లో స్త్రీలూ, కూలీలూకూడా ప్రవేశించేరు. దక్షిణాఫ్రికాలో భారతీయులంతా ఒక్కటిగా నిలబడ్డారు.

గనులలో పనిచేస్తూన్న భారతీయ కూలీలు సమ్మెచేసేరు. భారతీయులయిన కుట్టుపనివారు, బండితోలువారు, గృహసేవకులు, కూలీలు, రైతులూ, ఆఖరుకి చాకళ్లుకూడా తెల్లవారికి సహాయం నిరాకరించేరు.

దీనికి తోడు 1913 నవంబరు 6 వ తేదీన ఇంచుమించు 2250 మంది ఒక జథాగా బయలుదేరి చట్టవిరుద్ధంగా నేటాల్ సరిహద్దులుదాటి ట్రాన్స్‌వాలులో అడుగుపెట్టి ముందుకి సాగేరు. ప్రభుత్వం అందర్నీ అరస్టుచేసి నేటాలుకి తిప్పిపంపేసింది. వుద్యమంకూలీలలోకి పాకేటప్పటికి గాని, ప్రభుత్వానికి అసలుప్రమాదం గుర్తుకురాలేదు. పైగా యూరోపులో యుద్ధచ్ఛాయలు అలుముకుంటూన్న సమయంలో గృహశాంతి అవసరంగా గుర్తించివుంటుంది.

దానితో 1914 లో ఇండియన్ రిలీఫ్ అక్టు తయారుచేసేరు.

ఈ శాసనం భారతీయులమీద విధించబడిన 3 పౌనుల తల పన్నుని రద్దుచేసేసింది. రిజిస్ట్రేషను చేయించుకోడంలో నిర్బంధం రద్దుచేసింది. స్మట్సు భారతీయులయెడ ప్రభుత్వం సానుభూతిగా వుంటుందని హామీయిచ్చేడు.

సత్యాగ్రహం నిలుపుచేయబడింది. భారతీయులు సాగిస్తూన్న పోరాటంలో తాత్కాలిక విరామం ఏర్పంది.

దక్షిణాఫ్రికా ఇండియన్‌కాంగ్రెసు ఈ విధంగా ప్రథమవిజయం సాధించింది.

4

ప్రభుత్వపు యెదురుదాడి

దక్షిణాఫ్రికా ప్రభుత్వం 1914 లో తాత్కాలికంగా మాత్రమే వెనకడుగు వేసింది. భారతీయుల ఐక్యపోరాటపు ప్రమాదాన్ని అప్పటి మట్టుకు తప్పించుకుని కాలక్రమంలో ఏమరుపాటుగాచూసి దెబ్బ తియ్యాలి అనే ఎత్తుతప్ప ఇది మరొకటికాదు.

ఈ వెనకడుగువేసే లోపున దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఏ నాగరిక దేశంలోనైనా మానవ మాత్రుడికి వుండే కొద్దిపాటి మానవ హక్కులు కూడా భారతీయులకి లేకుండా చెయ్యడానికి ఎన్నో శాసనాలు చేసింది. అవన్నీ పేరుపేరు వరుసన చెప్పుకొస్తే గ్రంథం పెరిగిపోతుంది. కనక ఏవో కొన్ని ముఖ్యమైన వాటినే నాలుగు అయిదింటిని చెప్తే పౌరసత్వపు హక్కులపై ప్రభుత్వం ఎంతెంత ప్రమాదకరమైన చట్టాలు చేసిందో తెలుస్తుంది.

1907 లో ట్రాన్స్‌వాల్ ప్రభుత్వం రెండు శాసనాలుచేసింది. ఒకటి తెల్లవారు కానివారికి ఆయుధాలు కలిగివుండే హక్కుని తొలగించింది. రెండోది యూరపియనుల పాఠశాలల్లోకి ఇండియన్ బాలుర ప్రవేశాన్ని నిషేధించింది. ఆ విధంగా భారతీయుల బిడ్డలకి ఉచితంగా ప్రాథమికవిద్య లభించకుండా చెయ్యబడింది.

మరుసటి సంవత్సరమే మరో రెండు బిల్లులు వచ్చేయి. అందులో నొకటి పట్టణాలలో భారతీయులు నివసించడాన్ని, ఇళ్ళు కొనుక్కోడాన్ని నిషేధించింది. ఎవ్వరేనా యూరపియన్లు అధికలాభాలు ఆశించి భారతీయులకి ఇళ్ళు అమ్మినా అద్దెకిచ్చినా శిక్షిస్తామన్నారు. రెండో శాసనం గనులున్న ప్రదేశాలలోకి భారతీయులు మైనింగ్ కమీషనువారి అధికారం లేనిదే అడుగుపెట్టకుండా నిషేధించింది.

ఈ విధంగా ఎన్నైనా చెప్పుకుపోవచ్చు. మొదటి ప్రపంచయుద్ధం ముగిసీ ముగియడంతోనే యూరపియన్లు మళ్ళీ తమ దండయాత్ర ప్రారంభించేరు.

1909 లో ట్రాన్స్‌వాల్ కంపెనీ చట్టంప్రకారం భారతీయులు జాయింటు స్టాక్ కంపెనీలుగా ఏర్పడి కంపెనీలపేరిట స్థిరాస్తులు కొనుక్కోడానికి అవకాశం ఏర్పడింది. యుద్ధానంతరం యూనియను ప్రభుత్వం మొట్టమొదట చేసినపని ఆ అవకాశాన్ని కాస్తా రద్దు చేసెయ్యడమే. భారతీయులకి వోటుహక్కు లేదుకదా? ఇంక ఎటువంటి ఘోర శాసనాలుచేస్తే మాత్రం తెల్లవారికి అభ్యంతరం చెప్పేటందు కెవరున్నారు.

పైగా ఇండియన్ కాంగ్రెసుకి ఎదురెత్తుగా 'సౌత్ ఆఫ్రికన్స్‌లీగ్' అంటూ పెట్టి దానిద్వారా భారతీయులకి వ్యతిరేక ప్రచారం నిరంతరాయంగా సాగించ మొదలుపెట్టేరు. వీరి ఆందోళన ఫలితంగానే భారతీయులు భూములు ఏ మూలనైనా సరే కొనుక్కోకుండా చేయవలసిన అవసరం వుందా అనేది విచారించడానికై ప్రభుత్వం లార్జి కమీషను అంటూ వేసేరు. ఆ కమీషను భారతీయులను ప్రత్యేకించకూడదని రిపోర్టు విచ్చింది.

1921 లో జరిగిన ఇంపీరియల్ కాన్ఫరెన్సులో భారతీయులకి వోటుహక్కు వివ్వవలసిందనీ, పౌరసత్వపు హక్కులు గుర్తించవలసిందనీ బ్రిటిష్ ప్రభుత్వం దక్షిణాఫ్రికా ప్రభుత్వాన్ని కోరింది. కాని, లీగ్ ఆఫ్ నేషన్సులో అల్పసంఖ్యాక జాతులకి ప్రజాతంత్ర హక్కు లుండాలని గంభీరోపన్యాసం చేసిన జనరల్ స్మట్సు దక్షిణాఫ్రికా రాజ్యాంగ చట్టానికి పునాది అసమానత్వమేనని మొండిగా చెప్పేడు. పైగా, కసికొద్దీ చేసినట్లు మరిమూడు చట్టాలు అమలులోకి తెచ్చేడు.

వాటిలో ఒకటి నేటాలులో భారతీయులకున్న వర్తక సౌకర్యాలపై దెబ్బతీసింది. మరియొకటి భారతీయులకి అంతవరకూ మిగిలివున్న మునిసిపల్ వోటు హక్కును తొలగించింది. మూడోది నేటాలులోని యూరపియనులుండే ప్రదేశంలో భారతీయులు భూములు కొనుక్కునే హక్కును తొలగించింది.

భారతీయుల ఆందోళన ఫలితంగా భారత ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వాన్ని దక్షిణాఫ్రికా వ్యవహారాన్ని విచారించవలసిందిగా కోరింది. దాని

మీద ఆ సమస్య 1923 లో ఇంపీరియల్ కాన్ఫరెన్సులో చర్చకి తేబడింది. అక్కడ సర్ తేజబహదూర్ సప్రూ ప్రశ్నలకి సమాధానం ఇవ్వలేక జనరల్ స్మట్సు బహు మొండితనంగా దక్షిణాఫ్రికా భారతీయుల సమస్యఅక్కడి ప్రభుత్వపు ఆంతరంగిక సమస్య అనీ, దానిలో ఇతరులు తల దూరిస్తే వొప్పుకోమనీ గదిమేడు. దానితో బ్రిటిష్ ప్రభుత్వం నోరుమూసుకు వూరుకుంది. భారత ప్రభుత్వంకూడా ఇంక ఆ సమస్యనెత్తలేదు.

1924 లో భారతీయులని నమలకుండా మింగాలనే నేషనలిస్టు పార్టీవారి ప్రభుత్వం దక్షిణాఫ్రికాలో ఏర్పడింది. జనరల్ హెర్ట్జోగ్ ప్రధానమంత్రి అయ్యేడు. నాజీలకి యూదులపైగల క్రోధంకంటె ఈయనికి భారతీయులమీద క్రోధం హెచ్చు. ఈయన ప్రోత్సాహంమీద డాక్టర్ మలాన్ (దేశీయశాఖామంత్రి) భారతీయుల్ని మెడమీద చెయ్యేసి దేశం బయటికి త్రోసివేసేందుకై భారతీయులకి ప్రదేశాలు నిర్ణయిస్తూ Class areas reservation bill) బిల్లు ప్రవేశపెట్టేడు. దీని ప్రకారం భారతీయులు నివసించేటందుకై ప్రదేశాలు నిర్ణయించబడతాయి. ఆ ప్రదేశాల్లో నివసించే భారతీయులు ఇతరచోట్ల వర్తకం జరుపుకోకూడదు. ఇంతకంటే ఘోరం ఇంకొకటి. వలసవిషయాలుచూసే ఆఫీసరు తనకి తోస్తే ఎంతటి చిన్న నేరానికేనాసరే, దక్షిణాఫ్రికాలో పుట్టిపెరిగిన వానినికూడా దేశంలోంచి బయటకి పంపెయ్యవచ్చు. (ప్రస్తుతం ఇటువంటి బిల్లే కెన్యాలో ప్రవేశపెట్టబడింది.)

గనులు - పరిశ్రమల అక్టుఅనే మరోబిల్లుద్వారా ఆశియావాసులు యంత్రాలుపయోగించ కూడదు. అని నిషేధించేరు.

భారతీయుల గొంతు నొక్కి దేశంలోంచి తరిమి వేసేటందుకై దక్షిణాఫ్రికాప్రభుత్వం చేస్తూన్న ఈ అన్యాయ శాసనాలకి విరుద్ధంగా ఆఫ్రికాలోనూ, భారతదేశంలోనూకూడా పెద్ద అలజడి బయలుదేరింది. భారత జాతీయమహాసభ ఈ బిల్లుల్ని ఖండిస్తూ తీర్మానించింది. శ్రీమతి సరోజినీదేవి రౌండ్‌టేబిలు సమావేశం జరిపి సమాధానం కుదుర్చుకోవాలని సూచించింది.

మొదట్లో తలబిరుసుతనంచూపినా దక్షిణాఫ్రికా ప్రభుత్వం ప్రపంచ ప్రజాభిప్రాయానికి తలవొంచక తప్పిందికాదు. 1927 లో కేప్‌టౌన్‌లో ఉభయ ప్రభుత్వాల ప్రతినిధుల సమావేశమై సంధికుదుర్చుకున్నారు.

దక్షిణాఫ్రికాలో పాశ్చాత్య జీవితవ్యయప్రమాణాన్ని నిలుపుకుంటూ, దానిని ఎక్కువ చేసేందుకూ ద. ఆ. ప్రభుత్వానికి న్యాయసమ్మతమైన హక్కువుంది. అని భారత ప్రభుత్వం అంగీకరించింది. ఆ జీవిత వ్యయ ప్రమాణానికి నిలబడగల భారతీయులు యూరపియనుల వీధులలో వుండొచ్చు. కాలేజీలలోనూ, పాఠశాలల్లోనూ అటువంటి వారికి ప్రవేశం ఇస్తామని ద. ఆ. ప్రభుత్వం అంగీకరించింది.

ఇంక ఇక్కడ వుండం, మాదేశం పోతామన్న వారికి బోనసులిస్తామన్నారు.

ఇది కూడా వొక సంధేనా? కాని, మన నెత్తిమీదనున్న పరాయి ప్రభుత్వం నుంచి ఇంతకన్న అదనం ఆశించడం తెలివితక్కువ దనం.

కేప్‌టౌన్ అగ్రిమెంటుతో డా॥ మలాన్ బిల్లు ఉపసంహరించుకోబడింది. మిగిలినవన్నీ యధా తధంగానే వుండిపోయినాయి.

దక్షిణాఫ్రికాలో భారత ప్రభుత్వం తరపున ఏజంటుజనరల్ నియమించబడ్డాడు.

ఈ సంధి తర్వాత భారతీయ విద్యార్థులకి చదువుకొనడానికి ఉన్నత స్థితిలోవున్న భారతీయ కుటుంబాలు మంచి ప్రదేశాలలో నివసించడానికీ వీలు చిక్కింది.

కాని, స్వదేశం తిరిగి పోవడానికి వొప్పుకున్న భారతీయుల సంఖ్య చాల స్వల్పం. రక్తం, చెమట ధారపోసి సంపాదించుకున్నవన్నీ వొదిలి భారతదేశానికి పోవడం వారి దృష్టిలో లాటరీలా కనబడింది. ఎన్నికష్టాలున్నా అక్కడేవుండి వాటి నెదుర్కోడానికే వారు సమ్మతించేరు.

పరిస్థితుల ప్రాబల్యంవలన ద. ఆ. ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గవలసివచ్చినా వీలు చూసుకుని మరలవెంటనే-1930 లోనే భారతీయులమీద దెబ్బతీయడానికి తయారయింది.

ప్రపంచాన్నంతనీ ఆవరించిన 1930 నాటి ఆర్థిక సంక్షోభపు దెబ్బ దక్షిణాఫ్రికాకూ తగిలింది. తమకి తగిలిన నష్టాన్ని భారతీయుల నెత్తికి రుద్దడానికై యూరపియను పెట్టుబడిదారులు జాతిద్వేషాన్ని మరింత పురిగొల్పేరు. శాసనసభలో డా॥ మలాన్ ట్రాన్సువాల్ ఏషియాటిక్ ల్యాండ్ టెన్యూర్ బిల్లును ప్రవేశ పెట్టేరు. దాని ప్రకారం:

● బంగారం దొరికే ప్రదేశంగా ప్రకటించబడిన చోట భారతీయుడు ఇల్లూ, భూమీ స్వంతానికి కలిగి వుండడానికి వీల్లేదు.

● భారతీయులు నివసించేటందుకు ప్రత్యేకంగా ప్రదేశాలనుమ్యునిసిపాలిటీలు కేటాయించాలి.

● బంగారు గనుల ప్రదేశంలో వ్యాపారం చేస్తూన్న భారతీయులు 5 ఏళ్ళలో వర్తకం కట్టేసి అటనుంచి పోవాలి.

● భారతీయుడికి స్థిరాస్థి వుండకూడదు.

● నిర్ణీత ప్రదేశాలలో తప్ప భారతీయులు వర్తకం చేసుకోకూడదు.

ఈ బిల్లు 1932 లో శాసన రూపం ధరించింది.

ఈ బిల్లు మీద మరల తీవ్రమైన ఆందోళన జరిగి 1936 లో కొద్ది సవరణలు జరిగేయి. అవయినా నామమాత్రమే. భారతీయులకి కేటాయించబడిన ప్రదేశాలలో వారు స్థిరాస్తి కలిగి వుండవచ్చునని మొదటి శాసనంలోలేని సౌకర్యాన్ని ఈ సవరణ కలిగించింది.

అదే సంవత్సరంలో స్లమ్స్ఆక్టు క్రింద అనారోగ్య నిలయాలుగా వుంటున్నాయనే పేరుతో భారతీయులు వుండే పేటల్లోని ఇళ్ళన్నీ నేలమట్టం చేసివేయబడ్డాయి. వేలకొద్ది బీద భారతీయులు నిలువ నీడలేకుండా అయ్యేరు. వారికి ప్రభుత్వం ఇళ్ళుకట్టించి ఇవ్వదు స్వంతంగా కట్టుకున్నా అనారోగ్య కరమని అంగీకరించదు. ఇంక ఏ తెల్ల యజమానో ఇళ్ళు కట్టించి, ఎంతో అద్దెవసూలు చేసుకోడానికి వీలుంది. అందుకే ఈ పనిజరిగింది. అల్లాగే జరిగిందికూడాను.

5

పెగ్గింగ్ ఆక్టు

యూరపియనుల జీవిత వ్యయప్రమాణానికి నిలబడగల ధనవంతులయిన భారతీయులు కేప్‌టౌన్ అగ్రిమెంటుతో యూరపినులు నివసించే ప్రదేశాలలోకి రావడానికి వీలుపడింది. యూరపియన్లవద్ద విశేషమైన ధరలుపెట్టి స్థలాలూ ఇళ్ళూకొనుక్కుని కాపురాలు రాదొడగేరు. దీనికికారణం భారతీయులకి ప్రత్యేకించబడిన ప్రదేశాలలో ఏవిధమైన సౌకర్యాల్లూ లేకపోవడమే.

భారతీయులు మ్యునిసిపాలిటీలకి ప్రతినిధుల్ని ఎన్నుకొనే హక్కు తొలగించబడ్డాక మ్యునిసిపల్‌కౌన్సిళ్ళలో వారి అజ కనుక్కునేవారెవరు? కూరల పెరళ్లుకలిగి కూరగాయలు అమ్ముకునేవారు యెంతలేసి పన్నులిచ్చుకుంటున్నా, కాస్తవర్షంకురిసిందంటే ఏళ్లూ, కోళ్లూదాటడానికి ఒక్కవంతెన కూడా వుండదు. పేటల్లో రోడ్లు వుండవు. దీపాలుండవు. పాయఖానా సౌకర్యాలుండవు.

అందుచేత కాస్త జరుగుబడివున్న భారతీయుడల్లా అన్నిసౌకర్యాలూ వుండే యూరపినుల ప్రదేశంలోకి రాప్రయత్నిస్తాడు. ఈ అవకాశాన్ని తీసుకుని తెల్లవారు ఇళ్ళస్థలాలకీ, ఇళ్ళకీ, యెంతో లాభాలు గుంజేవారు. అల్లాగయినా అవసరంకొద్దీ భారతీయులు వచ్చేవారు.

ఈరాక యూరపియన్లకి నచ్చలేదు. "భారతీయులు చొరబడిపోతున్నా" రని గోల బయలుదేర తీసేరు. నేటాల్‌పార్లమెంటులో ఈ సమస్యని సభ్యులు చర్చకి పెట్టేరు.

దానిమీద స్టట్‌ఫర్డు అనేఆయన "భారతీయుల్ని వారి ప్రదేశాలలో వుండేటట్లు చెయ్యడంకోసం" 1939 లో ఏషియాటిక్ బిల్లును ప్రవేశ పెట్టేడు. దానివలన.

● వాణిజ్య శాఖామంత్రి అంగీకారం పొందనిదే ఏ భారతీయుడికి వర్తకానికి లైసెన్సు నివ్వకూడదు.

● 1939 ఏప్రియలు 30 కి పూర్వం అద్దెకి తీసుకున్నవీ, కొన్నవీ తప్ప కొత్తగా ఇళ్ళూ, స్థలాలూ భారతీయులు అద్దెకి తీసుకోడంగాని, కొనడంగాని చెయ్యకూడదు.

ఈ బిల్లు జీవితం రెండేళ్ళు. ఈ లోపుగా భారతీయులవిషయమై తగు ఉపాయాలు ఆలోచించి, ఒకమార్గం వెయ్యడంకోసం బ్రూమ్‌కమిషను నియమించబడింది. భారతీయుల రాకవలన ప్రమాదం ఏమీలేదనీ, వారిని ఆటంకపరచవలసిన పనేమీ లేదనీ ఈ కమీషను 1941 లో రిపోర్టు నిచ్చింది,

అప్పుడు అధికారంలోవున్న జనరల్ స్మట్సు తాత్కాలికంగా తన ప్రయత్నాలని విరమించవలసి వచ్చింది. కాని యూరపియనులు ఊరుకోలేదు. వారి ఆందోళనఫలితంగా 1943 ఏప్రియలు నెలలో ట్రేడింగ్ అండ్ ఆక్యుపేషన్ ఆఫ్ ల్యాండ్ రెస్ట్రిక్షన్‌ఆక్టును (ట్రాన్స్‌వాల్, నేటాల్‌లలో) ప్రవేశ పెట్టేరు. ఇదే పెగ్గింగ్ బిల్లు అనే పేరున ప్రసిద్ధిపొందిన బిల్లు. దీనివలన :

డర్బాన్‌లో భారతీయులెవ్వరూ యూరపియన్లవద్ద ఇళ్ళు, స్థలాలుగాని వర్తకపునెలవులుగాని, అద్దెకుతీసుకోవడం, కొనడం చెయ్యకూడదు.

ఈ బిల్లు జీవితం 3 ఏళ్ళు అన్నారు. ఈలోపున భారతీయుల్ని వారి ప్రదేశాలకి బంధించి వుంచేటందుకు మార్గాలు వెతకడానికి ఒక కమీషనును నియోగించేరు.

దక్షిణాఫ్రికా భారతీయులు ఒక్కమాటమీద నిలబడి ఈ బిల్లును ఖండించేరు. మనదేశంలోకూడా ఆందోళన విశేషంగా జరిగింది. అప్పుడు ప్రజల్ని వూరుకో బెట్టడంకోసం అడ్వయిజర్ల ప్రభుత్వం వర్తక వ్యాపారాలు నిలిపేస్తామనీ, భారతదేశంలోవున్న దక్షిణాఫ్రికా వాసులమీద ఆదేశంలో భారతీయులమీద విధించినమాదిరి ఆంక్షలే పెడతామనీ ప్రకటించారు. కాని, అస్వతంత్ర ప్రభుత్వంయొక్క ఈ బెదరింపుకి దక్షిణాఫ్రికా ప్రభుత్వం బెదరలేదు సరిగదా, భారతీయుల టెక్నికల్ కాలేజీ పెట్టుకుందుకు కొనదలచిన ప్రదేశం బొటానికల్ గార్డెన్సుయొక్క ప్రశాంతతకి భంగంకలిగిస్తుందనేసాకుతో అనుమతి నిరాకరించిందికూడా.

పరాధీన భారతదేశం ఖరే నాయకత్వం క్రింద చెయ్యలేక పోయిన పనిని ద. ఆ. ఇండియన్ కాంగ్రెసూ, ప్రపంచప్రజలూ చెయ్యగలిగేరు.

ఈ లోపున ద. ఆఫ్రికాలో భారతీయులంతా కాంగ్రెసు వెనక నిలచి ప్రభుత్వ శాసనధిక్కారానికి ఉపాయా లాలోచిస్తూన్నారు. ప్రయత్నాలు చేస్తూన్నారు. కాంగ్రెసులోని అతివాదులంతా కార్మికోద్యమాలయొక్క, ఆఫ్రికను కమ్యూనిస్టులయొక్క, ఆఫ్రికను నేషనల్ కాంగ్రెసుయొక్క సహాయంతో జాత్యహంకార వాదులకీ ఫాసిస్టు శక్తులకీ వ్యతిరేకంగా పీడిత ప్రజల నన్ని తెగలవారినీ సంఘటిత పరచ సాగేరు.

ప్రభుత్వం ప్రమాదాన్ని గుర్తించి వెంటనే రాయబారాలకి దిగింది. ఇండియన్ కాంగ్రెసులో అధికారంలోవున్న మితవాదశక్తులుకూడా అతివాదుల ప్రాబల్యానికి భయపడి ప్రభుత్వంతో రాజీకి సిద్ధపడ్డారు.

ధనికులయిన వర్తకులూ, వ్యాపారులూ అంతవరకూ ఇండియను కాంగ్రెసుకి పెత్తనం వహించి వున్నారు. 1914 తర్వాత దక్షిణాఫ్రికా ప్రభుత్వం భారతీయుల హక్కుల్ని మలిమి, మ్రింగివేస్తూన్నా వీరు ఏవో ఒకటి రెండు పర్యాయాలు తప్ప, కదలలేదు. ఇండియన్ కాంగ్రెసును నామావశిష్టంగా చేసి వుంచేరు.

1935 నుంచి భారతీయ యువకులు కమ్యూనిస్టుపార్టీ వేపు మొగ్గుతూ, కార్మికోద్యమాలు నిర్మిస్తూ, ఆఫ్రికా ఆదిమ నివాసులతో నెయ్యం కలుపుతు వుండడం ఈ నాయకుల కిష్టంలేదు. ఈ పనులవలన తెల్లవారికి కోపంవచ్చి తమపైదాడి తీవ్రం చేస్తారని వారి భయం.

భారతీయులూ, ఆఫ్రికను దేశవాసులూ ఒకటి కాకుండా చెయ్యాలనే యూరపియనులు మొట్టమొదటి నుంచీ ఎత్తులు వేస్తూన్నారు. కాంగ్రెసు మితవాద నాయకత్వం వారి వలలో పడింది.

కాంగ్రెసులోని అతివాదశక్తుల యిష్టానికి విరుద్ధంగా ప్రిటోరియాలో ప్రభుత్వం ఇండియను కాంగ్రెసు నాయకులతో రాజీపడింది.

ఈ రాజీప్రకారం బిల్లురద్దయి, దానిస్థానంలో లైసెన్సింగ్ బోర్డు ఏర్పరచ బడింది. "యూరపియనుల నివాస ప్రదేశాలలోకి భారతీయుల రాకను కంట్రోలు" చెయ్యడం ఈ బోర్డు చెయ్యవలసినపని. దీనిలోముగ్గురు యూరపియన్లు, ఇద్దరు భారతీయులు వుంటారు. ఈ బోర్డుకి యూరపియనే

అధ్యక్షుడుగా వుండాలి. యూరపియనుల ప్రదేశాలలో ఇండ్లు కొనదలచిన, లేక కాపురం వుండదలచిన భారతీయులకి లైసెన్సు ఈ బోర్డు ఇవ్వాలి.

ఈ బోర్డులైసెన్సు ఇచ్చేదీ, లేనిదీ మనకే తెలుస్తూంది. దీనివలన భారతీయులకి శాసన రూపంలో నిషేధం తొలగినా, కార్యరూపంలో నిషేధం నిలిచే వుంది.

దీనివలన భారతీయులు సంపాదించిన దేదీలేదు. కాని, ద. ఆ. భారతీయులలో చీలికలు తెచ్చి ప్రభుత్వం విజయాన్నే పొందిందని చెప్పాలి.

ఈ సంధి అనంతరం ఇండియన్ కాంగ్రెస్‌లో చీలికలు వచ్చేసి, బలహీనపడి భారతీయుల హక్కుల రక్షణకి పోరాడగల శక్తిని తాత్కాలికంగా కోల్పోయింది.

కాని, ఈదశ దానికి తాత్కాలికము మాత్రమేననే విషయాన్ని ప్రభుత్వం గుర్తించలేక పోయింది. భారతీయుల ప్రతిఘటనా శక్తిని నాశనం చేసివేసేమనే భ్రమతో పెగ్గింగ్ బిల్లు యొక్క గడువు 3 సంవత్సరాలూ గడిచిపోగానే 1946 మే నెలలో మాలపల్లి బిల్లు (Asiatic Iand Tenure and represantation act) ను ప్రవేశ పెట్టేరు.

పెగ్గింగ్ బిల్లులోని లోపాల్నిసర్ది ఈ కొత్తబిల్లులో సందు దొరకకుండా తయారు చేసేరు.

1. పెగ్గింగుబిల్లు ఒక్క నేటాలుకే, అందులోనూ దర్బాన్ ప్రాంతంకి మాత్రమే వర్తిస్తుంది.

మాలపల్లి బిల్లు నేటాల్ ట్రాన్సువాలులు రెండింటికీ వర్తిస్తుంది.

2. పెగ్గింగ్ బిల్లు ప్రకారం భారతీయుడు ఒక్క యూరపియనుల నుంచి మాత్రమే ఇళ్ళూ స్థలాలూ కొనడానికి వీలులేదు.

మాలపల్లి బిల్లు యూరపియనుల నుండేగాక ఆఫ్రికనులు, చైనీయులు, మలయనులు, మొదలయిన భారతీయేతరు లెవరివద్దనుంచి కూడా కొనడాన్ని నిషేధిస్తూంది.

3. పెగ్గింగ్ బిల్లులోలేని కొత్తవిషయం ఒకటి మాలపల్లి బిల్లులో చేర్చబడింది.

భారతీయవర్తకులు తమ తమ నిర్ణీతప్రదేశాలలో తప్ప బయటకు వచ్చి వర్తకం చేసుకోకూడదు.

అంతేకాదు.

4. ఇది భారతీయుల ఓటు హక్కును శాశ్వతంగా నిర్మూలిస్తుంది. దానికి ప్రతిఫలంగా 150 మందిగల పార్లమెంటులోకి ముగ్గురు ప్రతినిధుల్ని ఎన్నుకునే హక్కు నిచ్చేరు. ఆ ప్రతినిధులు కూడా యూరపియన్లే అయి వుండాలి. కాని భారతీయుల్ని ఎన్నుకోడానికి వీలులేదు.

5. ఈ ఎన్నుకొనేటందుకు వోటుహక్కు అందరికీ లేదు.

— వోటుహక్కు మగవాళ్ళకే గాని. స్త్రీలకులేదు.

— వోటుకలిగివుండాలంటే మగవాడికి కనీసము 21 ఏంళ్ళుండాలి ;

— అధమం 6 వతరగతిగాని, దానితో సమానమైన మరొకటిగాని చదివివుండాలి.

— సాలుకి కనీసం 80 పౌనుల ఆదాయంగాని 250 పౌనులు తనఖా యిచ్చే స్థిరాస్తి ఏవిధమైన తనఖాలేనిదిగాని అతనికి వుండాలి.

ఈ హిరణ్యాక్షవరాలన్నీ తీర్చేవోటర్లు 250000 భారతీయులలో 7500 మందికంటె హెచ్చువుండరు.

దీనివలన భారతీయ ప్రతినిధులుగా వచ్చే యూరపియన్లు కూడా అతివాదాభిప్రాయాలు కలవారు కాకుండేటందుకై వోట్లను కార్మికులకీ పేదలకీ లేకుండాచేసి తమ స్థానాన్ని మరింత కట్టుదిట్టం చేసుకోదలిచేరు, యూరపియనులు. కాని, వారు అంచనా వేసుకోనిది భారతీయులలో అతివాదశక్తులవృద్ధీ, ఐక్యతా.

ఇండియనుకాంగ్రెసు నాయకుల మితవాదధోరణి కొన్నిఏళ్ళగా అక్కడి భారతీయులలో అసంతృప్తికరంగానే వుంది. 1944 లో ప్రిటోరియాలో ప్రభుత్వంతో చేసుకున్న అవమానకరమైన సంధితో ఆ అసంతృప్తి మరీ ఎక్కువయింది.

1945 లో అతివాదులంతా ఆంటీ సెగ్రిగేషన్‌కౌన్సిల్ గా ఏర్పడి ఇండియన్ కాంగ్రెసులోని మితవాదనాయకుల రాజీధోరణికి వ్యతిరేకంగా భారతీయులందరినీ ఐక్యపరచి తమ హక్కులకై పోరాడేటట్లు తయారుచేయసాగేరు.

భారతీయుల ఐక్యతా పోరాటానికి ఈ కౌన్సిలు కేంద్రం అయింది. ఈ కౌన్సిలు తన కార్యక్రమాన్ని నాల్గు సూత్రాలలో స్పష్టపరిచింది.

● ఏ విధమైన విధినిషేధాలు పెట్టకుండా వయోజనులందరికీ వోటుహక్కు, పౌరసత్వపుహక్కు ఇవ్వబడాలి.

● ఇండియన్ హైకమీషనరును పిలిపించేసి దక్షిణాఫ్రికాతో భారతప్రభుత్వం రాజకీయ సంబంధాలు తెంచుకోవాలి.

● ఇతర పీడిత ప్రజలందరితో, ముఖ్యంగా ఆఫ్రికను ఆదిమ నివాసులతో ఐక్యత సంపాదించాలి.

● రాజీబేరాలువద్దు. పోరాటంసాగించి హక్కులు సంపాదించాలి.

మిగిలిన విషయాలమాట ఏలాగున్నా ఆఫ్రికను ఆదిమవాసులతో కలియడం, వారికికూడా వోటుహక్కు కావాలనడం మితవాద నాయకులకి ఏ మాత్రమూ కిట్టలేదు. మితవాద నాయకులలో ముఖ్యుడైన కాజీ 1945 జనవరిలో జరిగిన ఐక్యసమావేశంలో మితవాద దృక్పథాన్ని ఈ విధంగా తెలియపరచేడు.

"భారతీయు లడుగుతూన్న వోటుహక్కు వారికొకప్పుడు వున్నదే. మధ్యలోదానిని తొలగించేరు. అంతే. కాని, ఆఫ్రికన్‌లకి వోటుహక్కు ఎప్పుడూలేదు. ఎప్పటికీరాదు. వోటుహక్కుకోసం యూరపియన్లు కాని యితర జాతులతో కలియడంవలన భారతీయులకే నష్టం."

దీనినిబట్టే తెలుస్తుంది మితవాదనాయకుల ధోరణి.

1945 సంవత్సరం అంతా అతివాద మితవాదులమధ్య తీవ్రమైన పోరాటంజరిగి ఆఖరుకి ద. ఆ. ఇండియన్ కాంగ్రెసు ఎన్నికలలో అతివాదులు విజయం పొందేరు. ఇండియను కాంగ్రెసు సభ్యులయిన స్త్రీ పురుషులు 8 వేలమంది పాల్గొన్న సమావేశంలో అతివాదులు ఎన్నికో బడ్డారు కార్య నిర్వాహక వర్గానికి.

అతివాదుల ఈ విజయాన్ని ప్రభుత్వం అంచనా వేసుకోలేదు.

తమ గుడ్డి ధోరణిలో ప్రభుత్వం అన్యాయములయిన శాసనాలు ప్రవేశ పెట్టడానికి తయారవుతూంటే ఇండియన్ కాంగ్రెసు శాసన ధిక్కారానికి పూర్తి ప్రయత్నాలు చెయ్యసాగింది.

ఆఫ్రికనులు తమ తోడ్పాటు నివ్వడానికి ముందుకు వచ్చేరు. "భారతీయులు ఈ అమానుష చట్టాల నెదిర్చి చేస్తూన్న పోరాటానికి కేవలం సానుభూతి చూపడమేకాదు. సహాయం కూడా ఇస్తాం" అంటూ ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెసు అధ్యక్షుడు ఎ.బి. జూమా ప్రకటించేడు.

దక్షిణాఫ్రికాలోని అన్ని జాతులనుంచి సభ్యులుగల కమ్యూనిస్టు పార్టీ "భారతీయుల న్యాయసమ్మతమైన పోరాటానికి పూర్తి సహకారం చెయ్య" డానికి సిద్ధపడింది.

ఈ విధంగా అతివాదుల నాయకత్వంలో ఇండియన్ కాంగ్రెసు ఒక్క భారతీయుల ఆసరాతోనేగాక, దక్షిణాఫ్రికాలోని పీడిత ప్రజలందరితోడ్పాటుతో మాలపల్లి బిల్లుని ప్రతిఘటించడానికి తయారైంది.

1946 జూన్ 13 న దక్షిణాఫ్రికాలో అన్నిచోట్ల భారతీయులు సత్యాగ్రహదినం జరిపేరు. మరునాడు దర్బాన్ కార్పొరేషన్‌కి సంబంధించిన భూమిలో డేరాలు వేసుకుని మకాంవేసి సత్యాగ్రహం ప్రారంభించేరు. నిషేధించిన ప్రదేశాలకివచ్చి సత్యాగ్రహులు నివసిస్తూ వున్నా తమ అమానుష చట్టరీత్యా వారిని నిర్బంధించడానికి ప్రభుత్వానికి దమ్ములు లేకపోయినాయి. దానిమీద కొందరు రౌడీలను పురిగొల్పి సత్యాగ్రహులపైకి పంపేరు. రౌడీలు సైకిలు గొలుసులు, కర్రలు, కత్తులతో సత్యాగ్రహులనుకొట్టి, డేరాలుపీకి, వారి సామానులన్నీ ఎత్తుకుపోయేరు.

సత్యాగ్రహులు చలించలేదు. మరల డేరాలు తయారయ్యాయి. మరల గూండాలు సకల దౌర్జన్యాలు చేసేరు. కాని ప్రభుత్వం దురంతకులపై ఏవిధమైనచర్యా తీసుకోలేదు. పైగా సత్యాగ్రహులు అక్కడకి రావడం ప్రజల్ని వుద్రేకపరుస్తూ వుంది గనక ఆ ప్రదేశంలోకి రాకూడదని నిషేధం జారీచేసింది. సత్యాగ్రహులు వినలేదు. అరస్టులు ప్రారంభించింది.

మూడువారాలలో మూడువందలకిపైగా అరస్టయ్యారు. పోలీసువాళ్ళచర్యలతో పాటు రౌడీలచర్యలుకూడా మితిమీరినాయి. ఒకరు మరణించేరుకూడా. కాని ప్రజలు భయపడలేదు. దినదినమూ ట్రాన్సువాలు, నేటాలు, కేప్ రాష్ట్రాలనుంచి పదులూ, పాతికలూ వాలంటీర్లువస్తూన్నారు. ఎందరో స్త్రీలుకూడా సత్యాగ్రహంలోపాల్గొంటూన్నారు అరెస్టు లవుతున్నారు. రౌడీలచేత దెబ్బలు తింటూన్నారు.

రౌడీలచర్యలు, ప్రభుత్వపు అన్యాయములూ దక్షిణాఫ్రికాలోని యూరపియనులలోకూడ భారతీయులపై సానుభూతిని కలిగించేయి. ప్రజాతంత్రవాదులంతా భారతీయుల వేపుచేరుతూన్నారు.

తమ అస్తిత్వంకోసం పోరాడుతూన్న మన సోదర భారతీయుల పోరాటం వ్యర్థంకాకూడదు. కాదు.

6

ఈ పోరాటంలో మనభాగం

గాంధీజీ 1946 జులై 10 నాడు ప్రార్థనాసభయంలో మన కర్తవ్యం ఏమిటో స్పష్టంగా చెప్పేరు.

"వారు మనవాళ్ళు. వారు జీవన్మరణ సంగ్రామం సాగిస్తున్నారు."

భారతదేశంలోని అన్నిపార్టీలూ భారతరాజకీయాలలో తమలో ఉన్న విభేదాలు తలచక ఏకకంఠంతో మాలపల్లి బిల్లును నిరసించేరు. భారతీయుల సత్యాగ్రహాన్ని బలపరచేరు. కాని, అంతతో చాలదు.

కాని, అంతకన్న ఎక్కువపని చెయ్యడానికి మనకి స్వాతంత్ర్యం ఏదీ? దక్షిణాఫ్రికా భారతీయులమీద తలవన్ను సిఫార్సుచేసిన విదేశీయులే యీవేళ మనమీద పెత్తనం చేస్తూన్నారు.

ఏళ్ళతరబడిగా దక్షిణాఫ్రికా ప్రభుత్వం మనభారతీయుల హక్కుల్ని ఒక్కొక్కటే మింగివేస్తూంది. ప్రజాసంస్థ లెంతగోలచేసినా ప్రభుత్వం కదలలేదు. ఆఖరుకి హైకమీషనరుని పిలిపించుకుని, రాజకీయ సంబంధాలు తెంచుకుని, ఆర్థికబంధాలు ప్రకటించేరు. ఇదేగనక ఏదన్నా స్వతంత్ర ప్రభుత్వం జరిగించివుంటే దక్షిణాఫ్రికా ప్రభుత్వం దిగివచ్చి వుండేది. కాని, మనది పరాధీనదేశం! ప్రభుత్వం మనదికాదు! మనమీద పెత్తనం చెలాయించే తెల్లవారియెడ ఇతరప్రభుత్వాలకి లక్ష్యంలేదు.

గనక, ఇంక మనమే కలగచేసుకోవాలి.

ఈ దక్షిణాఫ్రికా భారత సమస్యని మిత్రరాజ్య సమితి ముందుకి తేవాలి. "ప్రతిదేశం మానవహక్కులని గౌరవించాలి. జాతి, మత, లింగ, భాషాభేదాలతో నిమిత్తంలేకుండా ప్రాథమిక స్వాతంత్ర్యాలని గుర్తించాలి" అంటూ మిత్రరాజ్యసమితి ప్రణాళికయొక్క పీఠికలో వ్రాసిన స్మట్సు తన అధికారంతో జరుగుతూన్న ఈ అన్యాయాలకి, దురంతాలకి ఏమి సమాధానం చెప్తాడో ప్రపంచ ప్రజలముందు నిలబెట్టిఅడగాలి.

దక్షిణాఫ్రికా విషయమై ప్రపంచమంతనీ కదల్చాలి. ప్రజాతంత్రాన్ని రక్షిస్తున్నామని ప్రగల్భాలు కొట్టేబెవిన్, బైరన్సులు ఈ దురన్యాయానికి ఏమి సమాధానం ఇస్తారో చూద్దాం.

వీటన్నింటికంటే ముఖ్యం ధనము సందేశాలూ పంపాలి. భారతీయుల హక్కులకోసం పోరాడుతూన్న ఈ వీరుల కుటుంబాలు తిండి లేక బాధపడవలసిన గతిపట్టనియ్యమని మనం ప్రతిజ్ఞ తీసుకోవాలి. వారి వీరోచిత పోరాటాన్ని ప్రోత్సహిస్తూ ధైర్యవచనాలు, సందేశాలు పంపాలి

అంతేకాదు. దక్షిణాఫ్రికాలోని మన భారతీయ సోదరులందరిలోకి పుద్యమం వ్యాపించేటట్లూ, వా[illegible] 80 లక్షల ఆఫ్రికా నివాసులతోనూ ఐక్యతసాధించ గలిగేటట్లూతోడ్పడాలి. మాలపల్లి బిల్లుకు, ప్యాస్ చట్టాలకు విరుద్ధంగా ఉభయులు పోరాటంజరపడానికై ప్రతిజ్ఞ తీసుకొనేటట్లు తోడ్పడాలి.

సామ్రాజ్యవాద ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఐక్యతపొందేటట్లుమనం తోడ్పడాలి.

● దక్షిణాఫ్రికా సమస్యని మిత్రరాజ్య సమితిముందుకు తేండి!

● దక్షిణాఫ్రికాలో సోదరభారతీయుల సహాయానికై ధనమూ. ఇతరసహాయాలూ చేయండి.

● దక్షిణాఫ్రికాలో యూరపియను సామ్రాజ్యవాదులకి వ్యతిరేకంగా ఐక్యసంఘటన నిర్మించుకునేటందుకు తోడ్పడండి.

ఈ నినాదాలతో మనదేశంలో అన్ని పార్టీలవారమూ కలిసి స్వాతంత్ర్య సమానత్వాలకోసం సామ్రాజ్యవాదులతో పోరాడుతూన్న దక్షిణాఫ్రికా సోదర భారతీయుల సహాయానికై ప్రయత్నాలు చేద్దాం. దక్షిణాఫ్రికా సోదరులకి న్యాయం కలిగించేటందుకై మనంచేసే ఆందోళనయే మన స్వాతంత్ర్య సంపాదనకి ఐక్యత ఎంతఅవసరమో మనకి నేర్పుతుంది.

కమ్యూనిస్టుపార్టీ తీర్మానము

బొంబాయి పట్టణమున జూలై 22 తేదీన సమావేశమైన అఖిల భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్రకమిటీవారు ఈ క్రిందితీర్మానాన్ని అంగీకరించారు.

దక్షిణాఫ్రికాలో భారతీయులకు సమాన పౌరసత్వ హక్కులు సాధించుటకు మరియు భారతజాతి పేరు ప్రతిష్ఠలను రక్షించుటకు, దక్షిణాఫ్రికా యందలి రెండులక్షల యేబదివేల భారతీయులు జరుపుచున్న పోరాటమునకై వారికి భారతకమ్యూనిస్టుపార్టీ తన సౌహార్దిక అభినందనాలనర్పించుచున్నది.

దక్షిణాఫ్రికా ప్రభుత్వము, శాంతియుతంగా ప్రతిఘటన పోరాటము సలుపుచున్న భారతీయులపై సాగించుచున్న నిర్బంధవిధానాన్ని, తీవ్రంగా ఖండించుచు, ముఖ్యంగా, భారతీయు లందరపైనను, స్త్రీలపైనగూడా, అమానుషమైన అత్యాచారాలు జరుపుటకై తెల్ల గూండాల కొసగబడిన నిరాటంకమైన స్వేచ్ఛను, ఈ కమిటీవారు అత్యంత తీవ్రంగా నిరసించుచున్నారు.

భారతీయుడైనంతమాత్రాన, యూరపియను గూండాలచేత అతి క్రూరముగా హత్యగావింపబడిన, ఆంధోనిపిల్లై మరణమునకు దక్షిణాఫ్రికా యందలి ఇతర భారతీయులందరితోపాటు ఈ కమిటీ తన దుఃఖమును ప్రకటించుచున్నది.

భారతదేశ సమస్యకై జైలుశిక్ష ననుభవించినందులకు, దౌర్జన్య అవమానాల నన్నిటిని ధైర్యంగా భరించినందులకు వందలకొలది శాంతియుత సైనికులను ఈ కమిటీవారు అభినందించుచున్నారు.

భారతప్రజల దాస్యాన్ని శాశ్వతపరచుటకు, వారు తక్కువరకపు ప్రజలని చాటు నుద్దేశముతో, పారిశ్రామికులు, తోటల యజమానులు (Planters)తో గూడిన అల్ప సంఖ్యాకులగు శ్వేతపరిపాలక వర్గముచే చేయబడిన ఘెటో జాతి చట్టము (Racial Gheto act) ను ఈ కమిటీ వారు తీవ్రంగా ఖండిస్తున్నారు.

ఈ చట్టము జాత్యహంకారాన్ని సంపూర్ణ అసహ్య స్వరూపమున ప్రదర్శించుచున్నదనియు, హిట్లరుచే అమలు జరుపబడిన యూదుల వ్యతిరేక శాసనములకు మించినదనియు ఈ కమిటీ ప్రకటించుచున్నది.

భారతప్రభుత్వం దక్షిణాఫ్రికా భారతీయుల ఆస్తిపాస్తుల రక్షించుట యందు వహించిన ఉపేక్ష వైఖరికి ఈ కమిటీవారు తీవ్ర అసమ్మతిని తెలుపుచున్నారు.

వీరు ఎన్నియో సంవత్సరముల వరకు ఏలాటిచర్య తీసుకోలేదు. ఈ సంవత్సరము మాత్రము భారతదేశమంతట ప్రజాపార్టీలన్ని తీవ్ర ఆందోళన చేసినతర్వాత భారత హైకమీషనరును వెనుకకు రప్పించి దక్షిణాఫ్రికాకు వ్యతిరేకంగా ఆర్థిక ఆంక్షలను పెట్టారు. విదేశములలోని భారతీయుల హక్కులను భారతప్రజలు మాత్రమే రక్షింపజాలుదురని ఈ కమిటీవారు ప్రకటించుచున్నారు.

స్మట్సు ప్రభుత్వముయొక్క భారత వ్యతిరేక కుట్రను భారత రాజకీయ పార్టీలన్ని ఏకకంఠముతో ఖండించినవని గుర్తించుచున్నారు.

అన్నిపార్టీలు ఐక్యమై దక్షిణాఫ్రికా పోరాటానికి సహాయంగా ఒక తీవ్రాందోళన చేయవలయునని ఈ కమిటీవారు ప్రార్థించుచున్నారు.

ఆఫ్రికా జాతీయ కాంగ్రెసు అధ్యక్షులగు ఎ. బి. గుమాగారు భారతీయ పోరాటాన్ని బలపరచడం ఈ కమిటీవారు హర్షించుచున్నారు.

ఇది శ్వేతదాస్యంక్రింద బాధపడుచున్న భారత, ఆఫ్రికాప్రజల ఐక్య సంఘటన అభివృద్ధి చిహ్నంగా ఈ కమిటీ భావించుచున్నది.

ఇట్టి ఐక్యసంఘటనయే దక్షిణాఫ్రికాలోని ప్రజాస్వామిక ఉద్యమానికి, తాము నడుపుచున్న సామ్రాజ్య వ్యతిరేక పోరాటమునందు, విజయము చేకూర్చుటకు పరమ సాధనమని నమ్ముచున్నది.

దక్షిణాఫ్రికా కమ్యూనిస్టుపార్టీ భారతీయుల పోరాటాలను హృదయపూర్వకముగ బలపరచుచున్నందులకు ఈ కమిటీవారు హర్షించుచున్నారు.

(దక్షిణాఫ్రికాయందున్న రాజకీయపార్టీలలో ఒక్క కమ్యూనిస్టు పార్టీయందుమాత్రమే భారతీయులు, యూరపియనులు, అన్ని వర్గాల (Races) కు చెందినవారు సభ్యులుగా నున్నారు.) ముఖ్యంగా దక్షిణాఫ్రికాయందలి భారత కమ్యూనిస్టులలో ముఖ్యులగు డాక్టరు యూసుపుడాడూగారిని భారతీయుల పోరాటమునందు వారు వహించుచున్న నాయకత్వమును ప్రముఖపాత్రను అభినందించుచున్నది.

భారతదేశ స్వాతంత్ర్య సంరంభ అంతర్భాగముగ దక్షిణాఫ్రికా సోదరుల పోరాటాన్ని అనుకూలంగా విశాల సహాయాన్ని సంఘటిత పరుచుటకు ఈ కమిటీవారు ప్రతిజ్ఞ గైకొనుచున్నారు.

END OF
TITLE